నేడు బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ సమావేశం
–హాజరుకానున్న వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

జూబ్లీహిల్స్/బంజారాహిల్స్, నవంబర్ 25 : బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజక వర్గాల సమావేశం జరగనుంది. సికింద్రాబాద్, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో నిర్వహించనున్న ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల అనంతరం నిర్వహిస్తున్న ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకోనుంది. తెలంగాణ భవన్‌లో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్పొరేటర్లు, మాజీ చైర్మన్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులు హాజరుకావాలని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్ ఒక ప్రకటనలో కోరారు.

అలాగే.. ఖైరతాబాద్ నియోజక వర్గం బీఆర్ఎస్ ముఖ్యనేతలు, కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం తెలంగాణ భవన్‌లో నిర్వహిస్తున్నామని నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. పార్టీకి చెందిన కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు మైనార్టీ హక్కుల సాధన సమావేశం

చిక్కడపల్లి, నవంబర్ 25: క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం ఫౌండర్ ఆధ్వర్యంలో మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మైనార్టీ హక్కుల సాధన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు ఫౌండర్ ప్రెసిడెంట్ పీఏ మొల్కి సేదిక్ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా పలు పార్టీల నాయకులు హాజరవుతారని చెప్పారు. సీపీఎం నాయకుడు అబ్బాస్, సీపీఐ నాయకుడు యేసు, తదితరులు హాజరవుతారని తెలిపారు.

పెద్దవాళ్లకూ టీకాలు..

- ఆరు పదుల వయసులో బీసీజీ వ్యాక్సిన్..
- సంపూర్ణ క్షయ నివారణకు బూస్టర్ డోస్ ..
- సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

జూబ్లీహిల్స్, నవంబర్ 25 : చిన్నపిల్లలకు టీకాలు ఇవ్వడం సాధారణం.. రోగనిరోధక శక్తి పెంపొందించేందుకు పుట్టిన గడియ నుంచి ఐదేండ్ల వరకు వైద్యులు పిల్లలకు టీకాలు ఇస్తుంటారు. తాజాగా వయోజనులకు టీకాలు ఇచ్చేందుకు వైద్య, కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యాచరణ సిద్ధం చేసింది. ఏడాది లోపు నవజాత శిశువుకు ఇచ్చే బాసిల్లే కాల్మెట్ గ్యురిన్ (బీసీజీ) టీకాను ఆరు పదులు దాటినవారికి వారికి వేయనున్నారు. సంపూర్ణ క్షయ నివారణలో భాగంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం, రహ్మత్‌నగర్ డివిజన్, శ్రీరాంనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపడుతున్నారు. నవజాత శిశువుకు ఇచ్చే జీరో డోస్ వ్యాక్సిన్‌ను వృద్ధాప్యంలో రోగనిరోధక శక్తిని మరింత పెంపొందించేందుకు 60 ఏండ్లు పైబడిన వారికి బూస్టర్ డోస్‌గా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు ప్రతి ఇంట్లో వయోజనులను గుర్తించి వారిలో ఉన్న అనారోగ్య లక్షణాలను నమోదుచేయనున్నారు. సర్వేలో భాగంగా 2 వారాలకు మించిన దగ్గు.. జ్వరంతో పాటు గణనీయంగా బరువు తగ్గడం, కఫంలో రక్తం పడడం వంటి లక్షణాలున్న వారిని గుర్తించి బీసీజీ టీకాలు వేయనున్నారు.

శ్రీరాంనగర్ పీహెచ్‌సీ పరిధిలో సర్వే చేస్తున్న ఏఎన్ఎం రజిత

ఎవరికి ఇవ్వాలి.. ఎవరికి ఇవ్వకూడదు

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ ఎవరికి ఇవ్వాలి.. ఎవరికి ఇవ్వకూడదు అన్న దానిపై అధికారులు స్పష్టత ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఎత్తుకు తగ్గ బరువులేనివారికి, డయాబెటిస్ ఉన్నవారికి, ధూమపానం చేసే వారికి, గతంలో టీబీతో బాధపడిన వారి కుటుంబ సభ్యులకు, వారితో సమీపంలో ఉన్నవారికి ఇవ్వవచ్చు. అంతేకాకుండా 60 ఏండ్లు పైబడిన వారిలో పెరాలసిస్, డయాలసిస్, గుండె జబ్బులు, క్యాన్సర్, క్రానిక్ డిసీజెస్ ఉన్నవారికి తప్ప అందరికీ ఇవ్వవచ్చు. ఈ వ్యాక్సిన్‌ను 18 ఏండ్లలోపు ఉన్న పిల్లలకు ఇవ్వకూడదు. ఇమ్యూనిటీ తక్కువగా ఉన్నవారికి, గర్భిణులకు , పాలిచ్చే తల్లులకు, తలసేమియా పేషెంట్లకు ఇవ్వకూడదని స్పష్టం చేస్తున్నారు.

బీసీజీ చాలా సేఫ్ వ్యాక్సిన్

బీసీజీ చాలా సేఫ్ వ్యాక్సిన్. శిశువు పుట్టిన ఏడాదిలోపు ఇచ్చే ఈ వ్యాక్సిన్‌తో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. హైదరాబాద్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా 17 జిల్లాల్లో పైలెట్ ప్రాజెక్ట్‌గా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యాక్సిన్ ఇవ్వాల్సిన వారిని గుర్తించేందుకు ఇంటింటి సర్వే చేస్తు న్నాం. ఆశ వర్కర్లు సమగ్ర కుటుంబ సర్వే విధుల్లో ఉన్నందున ప్రస్తుతం ఏఎన్ఎంలు సర్వే చేస్తున్నారు. ఆశలతో కలిసి డిసెంబర్ మొదటివారం వరకు సర్వే పూర్తిచేసి అధికారులకు నివేదిక అందిస్తాం.

– డాక్టర్ బి.విజయనిర్మల, ఎస్‌పీహెచ్‌ఓ, శ్రీరాంనగర్ క్లస్టర్

కార్మికుల సమస్యలపై ఐక్యంగా ఉద్యమిద్దాం..
26న జరిగే మహాధర్నాను విజయవంతం చేద్దాం : సీఐటీయూ

మహా ధర్నా కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీఐటీయూ నాయకులు

మణికొండ, నవంబర్ 25: కార్మికుల సమస్యలపై అందరూ కలిసికట్టుగా ఉద్యమించినప్పుడే తమ హక్కులను సాధించుకోగలుగుతామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, గండిపేట్ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్‌లు అన్నారు. నవంబర్ 26న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని మున్సిపల్ కార్మికులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ సంకీర్తన ప్రభుత్వం కార్మిక , రైతు వ్యవసాయ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో 10 జాతీయ కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా, ఎస్కేఎం, వ్యవసాయ కార్మిక సంఘాలు ఐక్యంగా దేశవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చాయన్నారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో నవంబర్ 15 నుంచి 25 వరకు కరపత్రాలు పంపిణీ, సభలు, సమావేశాల ద్వారా ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై విస్తృత ప్రచారంచేసి నవంబర్ 26న అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో నిరసనలు చేయాలని పిలుపునిచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సుమారు 65వేల మంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పని చేస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు , రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ప్రభుత్వ సంక్షేమాలు అమలు కావడం లేదని అన్నారు. ప్రమాదాల్లో మరణిస్తున్న కార్మికులకు రూ.15 లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, పీఎఫ్‌పీఎస్‌ఐ డబ్బులు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. కార్మికులు మరణిస్తే దహన మట్టి ఖర్చులు నిమిత్తం రూ.30 వేలను తక్షణమే సహాయంగా కుటుంబానికి అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలే రాజు, చిట్టి బాబు, కార్మికులు హంసమ్మ, సరళ, చంద్రకళ, రమ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులను కాపాడుకోవాలి..

హిమాయత్‌నగర్,నవంబర్25: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ రంగంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏండ్ల తరబడి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే కార్మికులు చాలీచాలని వేతనాలు తీసుకుని జీవనం సాగిస్తున్నారని,వారికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా పనిచేస్తుందన్నారు. కార్మిక వర్గం ఐక్యతతో హక్కులను కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

చిక్కడపల్లి, నవంబర్ 25: సామాజికంగా అత్యంత వెనుకబడిన వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వడ్డెర్ల ఆత్మ గౌరవ భవన సముదాయ ట్రస్ట్– తెలంగాణ చైర్మన్ జెరిపేటి సత్యనారాయణ రాజు, వైస్‌చైర్మన్ ఎత్తరి అంతయ్య సోమవారం బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యంత వెనుకబడిన బీసీ–ఏలో ఉన్న వడ్డెరులను ప్రభుత్వం అసెంబ్లీ తీర్మానం చేసి ఎస్టీ జాబితాలో చేర్చాలని అన్నారు.

డైరీ కళాశాల అభివృద్ధికి 4కోట్లు విరాళం

వీసీకి చెక్ అందజేస్తున్న దొడ్ల సీఈఓ, తదితరులు

వ్యవసాయ యూనివర్సిటీ , నవంబర్ 25 : పశు వైద్య యూనివర్సిటీ అభివృద్ధికి మరిన్ని సంస్థలు ముందుకు రావాలని పీవీ నర్సింహారావు తెలంగాణ రాష్ట్ర పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి , పశుసంవర్ధక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సభ్యసాచి ఘోష్ అన్నారు. సోమవారం తన చాంబర్‌కు దొడ్ల డైరీ బోర్డు సీఈఓ డా. బీవీకే రెడ్డి వచ్చి రూ. 4కోట్ల చెక్కును విరాళంగా అందజేశారు. కామారెడ్డి డైరీ టెక్నాలజీ కళాశాల భవనం మొదటి అంతస్తు, కళాశాల సమీపంలో గల నేషనల్ హైవే నుంచి సీసీ రోడ్లు వేయాలని సూచించారు. దొడ్ల డైరీ చైర్మన్ సునీల్ రెడ్డి, సీఈఓ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మరిన్ని సంస్థలు ముందుకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డా. శరత్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

దీపక్ జాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ నేతలు

బంజారాహిల్స్, నవంబర్ 25: రాష్ట్రం లో క్రైస్తవులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం తనవంతు కృషి చేస్తానని తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ హామీ ఇచ్చారు. సోమవారం తెలంగాణ క్రిస్టియన్ రైట్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు డా.బి.పీటర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఫిలింనగర్‌లో చైర్మన్ దీపక్ జాన్‌ను కలిశారు. క్రైస్తవులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని, ప్రభుత్వ పథకాలు రావడం లేదని ఆర్గనైజేషన్ నేతలు వివరించారు. నగరంలో శ్మశానవాటికలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని వారు ఫిర్యా దు చేశారు. దీనికి స్పందించిన క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్.. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం తరపున క్రిస్మస్ ఫీస్ట్ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జె.ప్రశాంత్‌కుమార్, కార్యదర్శి దిలీప్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి.కిశోర్, స్వాతి, చైర్మన్ ఆంథోనీ దాస్, రెవరెండ్ జీవానందం, ఉమెన్స్ వింగ్ అధ్యక్షురాలు సరోజ భాస్కర్, రోజా గంధం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సీనియర్ నేత ముఖ్రేశ్‌ను సన్మానిస్తున్న అయ్యప్ప స్వాములు

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: ఆధ్యాత్మిక చింతనతో ప్రతి ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తుందని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అప్పారెడ్డి ముఖ్రేశ్ అన్నారు. అత్తాపూర్ డివిజన్, రాంబాగ్‌లోని శ్రీ రామభక్త మహవీర్ హనుమాన్ దేవాలయంలో మాల ధరించిన అయ్యప్ప స్వాముల కోసం నిత్య అన్నదాన(భిక్ష) కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు. ఈ నెల 24 నుంచి జనవరి 1 వరకు ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 నుంచి 2.30 గంటల వరకు ఈ అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించాలని కోరారు. అనంతరం సన్నిధాన స్వాములు ముఖ్రేశ్‌ను శాలువాలతో సన్మానించారు. ఈ పూజల్లో ఈశ్వర్ స్వామి, శేఖర్, శ్యామ్, రాజు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ రోడ్ నం.14లో ఆక్రమణల తొలగింపు

బంజారాహిల్స్‌లోని బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి సమీపంలో ఆక్రమణల తొలగింపును పరిశీలిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్

బంజారాహిల్స్,నవంబర్ 25: బంజారాహిల్స్ రోడ్ నం.14లోని నందీనగర్ నుంచి బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లేదారిలో వెలిసిన రోడ్డు ఆక్రమణలను ట్రాఫిక్ పోలీసులు 'అపరేషన్ రోప్' కార్యక్రమంలో భాగంగా సోమవారం తొలగింపు ప్రక్రియను చేపట్టారు. టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, పండ్ల వ్యాపారాలు రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేస్తుండడంతో పాటు వాహనాలు పార్క్ చేస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందులు ఏర్పడుతుండడంతో ట్రాఫిక్ పోలీసులు ఇటీవల వారికి హెచ్చరికలు జారీ చేశారు. అ యినప్పటికీ పద్ధతి మార్చుకోకపోవడంతో వాటిని తొలగించారు. మరోసారి రోడ్డు ఆక్రమణలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తా మని ట్రాఫిక్ ఏసీపీ హరిప్రసాద్ హెచ్చరించారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహాపడి పూజ

బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్షాకోట్‌లో ఆదివారం సంతోష్‌కుమార్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను నిర్వహించారు. పూజా కార్యక్రమంలో గురుస్వాములు మధుసూదన్ , గోపిగౌడ్, ఉదయ్‌గౌడ్, జతిన్, హార్థిక్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

– బండ్లగూడ, నవంబర్ 25

అర్హులందరూ ఓటరుగా నమోదు చేయించుకోవాలి
నేడు యూసుఫ్‌గూడలో ర్యాలీ

జూబ్లీహిల్స్, నవంబర్ 25: ఓటరు నమో దు ప్రాధాన్యతపై మంగళవారం యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు నుంచి అవగాహన ర్యాలీ చేపట్టనున్నట్లు యూసీడీ డీపీఓ వెంకటకిషన్ రావు తెలిపారు. 2025, జనవరి 1 నాటికి 18 ఏండ్లు నిండనున్న యువతీ యు వకులు ముందుగా తమపేర్లు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రధానంగా ఉద్యోగ, ఉపాధి నిమిత్తం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారుతున్న వారు చిరునామాలు మార్పు చేయించుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నూతన ఓటరు జాబితా సిద్ధం చేసేందుకు స్పెషల్ సమ్మరి రివిజన్ చేపడుతున్నామని జీహెచ్ఎంసీ 19వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జా కియా సుల్తానా తెలిపారు. ఇందులో భాగంగా అ ర్హులందరూ తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈనెలాఖరు వరకు నూతన ఓటరు నమోదు, సవరణలు చేపడుతున్నందున.. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: మైలార్‌దేవ్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మైలార్‌దేవ్‌పల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు టాటానగర్, బృందావన్ కాలనీ, ప్రగతి కాలనీ, మోగల్స్ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి గ్రామం, రామకృష్ణ హిల్స్, వినాయకనగర్, తదితర ప్రాంతాల్లో కోత ఉంటుందన్నారు. అలాగే ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు ఆలీనగర్, ఆయుషా కాలనీ, అహ్మద్‌నగర్, ప్లేస్ వ్యూ కాలనీ, కింగ్స్‌అవెన్యూ, దస్తగిరినగర్, సుబాన్ కాలనీ, పల్లెచెరువు, తదితర ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా కోత విధిస్తున్నామని , ఇందుకు విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు
రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

ఆరాంఘర్ చౌరస్తాలో అధికారులతో మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25 : ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ వెల్లడించారు. సోమవారం దుర్గానగర్, రాజేంద్రనగర్, పల్లె చెరువు, తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఉల్లంఘనలను నివారించడానికి, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడానికి పర్యటించారు. ఈ సందర్భంగా రోడ్ల మధ్యలో ఉన్న చిన్న చిన్న టర్నింగ్‌లను మూసి వేయించారు. అలాగే వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. అనంతరం రాజేంద్రనగర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో ఆరాంఘర్ చౌరస్తాలోని బస్టాప్‌ను పరిశీలించారు. బస్టాప్‌ను అనువైన ప్రాంతానికి మార్చేందుకు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. అనంతరం ఏసీపీ మాట్లాడుతూ .. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మట్‌ను తప్పకుండా ధరించాలన్నారు. అలాగే కార్లలో సీటు బెల్ట్ వేసుకోవాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వారు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాల యజమానులతో పాటు కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో చిక్కులు.. సిబ్బందికి ఇబ్బందులు

జూబ్లీహిల్స్, నవంబర్ 25 : జీహెచ్ఎంసీ అధికారులు చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో సిబ్బందికి అనేక చిక్కులు వచ్చిపడుతున్నాయి. కుటుంబ సభ్యుల మధ్య మాత్రమే ఉండాల్సిన కొన్ని విషయాలు సమగ్ర సర్వేలో వెల్లడించాల్సి వస్తుండడంతో పలువర్గాల ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. ప్రధానంగా గేటెడ్ కమ్యునిటీల్లో సర్వేపై అనాసక్తి కనబరుస్తున్నారు. జీహెచ్ఎంసీ సిబ్బంది సర్వేకు వస్తుండడంతో కొంతమంది ఇళ్ళకు తాళాలు వేస్తున్నారు. జనాభా ఎక్కువగా ఉండే నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రజలు స్వగ్రామాల్లో వివరాలు ఇస్తామని సర్వే సిబ్బందిని వెనక్కు పంపుతున్నారు. దీంతో సమగ్ర కుటుంబ సర్వే అసమగ్రంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు స్టిక్కర్‌లు వేయ నిగృహాలు.. మరోవైపు స్టిక్కర్లు వేసినా సర్వే పూర్తికాని గృహాలు గణనీయంగా ఉన్నాయి. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో 80 నుంచి 90 శాతం సర్వే పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. అయితే పక్షం రోజులు అన్న సర్వే 20 రోజు లు కావస్తున్నా క్షేత్రస్థాయిలో అసంపూర్ణంగానే మిగిలే అవకాశాలున్నా యి. సర్వే పూర్తిచేసి డేటా ఎంట్రీ చేసేందుకు అధికారులు సిద్ధమవుతుండగా వివిధ కారణాలతో 100 శాతం సర్వే పూర్తికావడం ప్రశ్నార్థకం గా మారనుంది.

గౌరవ వేతనం అందేనా..

సర్వే చేస్తున్న సిబ్బందికి ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందన్న దానిపై స్పష్టత లేదు. ఒక ఎన్యుమరేటర్ 150 ఇండ్లను సర్వే చేయాల్సి ఉంటుంది. ఆయా ఎన్యుమరేషన్ బ్లాక్‌లో 20 నుంచి 30 ఇండ్లు పెరగవచ్చు.. లేదా తగ్గవచ్చు.. ఒక ఎన్యుమరేటర్ తన పరిధిలో సర్వే పూర్తిచేస్తే అధికారులు రూ.10 చెల్లిస్తామని మౌఖికంగా చెప్పారు. అయితే సర్వే 15 రోజుల్లో పూర్తిచేయవచ్చని అధికారులు చెప్పడంతో రంగంలోకి దిగిన సిబ్బందికి సర్వే ఎంతకీ పూర్తికాకపోవడం కొంత ఇబ్బందిగా మారింది. సర్వే చేసిన ప్రొఫార్మాల డేటా ఎంట్రీ చేసే సిబ్బందికి కూడా గౌరవ వేతనం ఎంత చెల్లిస్తారు.. ఎప్పుడు చెల్లిస్తారు అన్నదానిపై స్పష్టత లేదు. దీంతో సర్వే చేస్తున్న ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లతో పాటు సర్వే చేస్తున్న సిబ్బంది సైతం నిరాసక్తతో ఉన్నారు. ఒకవైపు విధులు నిర్వర్తిస్తూనే సర్వే కొనసాగిస్తున్న సిబ్బందికి ఈ ఇబ్బందులు ఇంకా కొనసాగనున్నాయి.

పైప్‌లైన్‌కు లీకేజ్.. వృథాగా మంచినీరు

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: అత్తాపూర్ డివిజన్, చిన్న అనంతగిరి శివాలయం ప్రాంతంలో మంచినీరు గత రెండు రోజులుగా వృథా గా పోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడంలేదు. రాజేంద్రనగర్ జల మండలి అధికారులకు ఫోన్‌లు చేసి ఫిర్యాదు చేస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. లీకేజీ ఏర్పడిన పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని అన్నారు. కొన్ని కాలనీలకు, బస్తీలకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నా అధికారులకు కనిపించడం లేదా అని అంటున్నారు. పైపులైన్ పగిలిపోవడంతో దాదాపు మూడు కిలోమీటర్ల మేర ఈ నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజావాణికి 26 ఫిర్యాదులు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 25 : కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 26 ఫిర్యాదులు వచ్చినట్లు జోనల్ అధికారులు తెలిపారు. జోన్ ఆఫీస్‌లో ప్రజావాణికి 18 ఫిర్యాదులు రాగా టౌన్‌ప్లానింగ్ విభాగానికి 14, ఇంజినీరింగ్ విభాగానికి 3 , ఎంటమాలజీ విభాగానికి 1 ఫిర్యాదు వచ్చినట్లు తెలిపారు. అదేవిధంగా కూ కట్‌పల్లి జంట సర్కిళ్ల కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చాయి. మూసాపేట సర్కిల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ విభాగానికి 5 ఫిర్యాదులు వచ్చినట్లు పేర్కొన్నారు.

మంచినీటి సౌకర్యం కల్పించాలి
బీఆర్ఎస్ సీనియర్ నేత వెంకటేశ్

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 25: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.వెంకటేశ్ కోరారు. సోమవారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నెలకొన్న సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన .. సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. కాలనీల్లో మంచి నీటి సౌకర్యం ఏమాత్రం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దాదాపు 20 సంవత్సరాల నుంచి ఈ బ